ప్రజాశక్తి

శనివారం 8 ఏప్రిల్ 2023

8 పేజీలు



ఎన్‌టిఆర్




కృష్ణా

కరోనా కలకలం

- కృష్ణాజిల్లాలో రెండు కేసులు గుర్తింపు
- అప్రమత్తమైన యంత్రాంగం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లాలో కరోనా కేసుల నమోదు కలకలం రేపుతున్నాయి. మూడు రోజుల వ్యవధిలోనే రెండు పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. కరోనా వ్యాప్తిపై కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోనూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గ తదితర లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తులకు తొలుత రాపిడ్ టెస్టు, ఆ తర్వాత ఆర్‌టిపిసిఆర్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా గన్నవరం మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జలుబు, దగ్గుతో బాధపడుతూ చికిత్సకు గన్నవరం ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. రాపిడ్ టెస్టులో కరోనా పాజిటివ్‌గా తేలింది. ఆర్‌టిపిసిఆర్ టెస్టు నిర్వహణకు పేషెంట్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం పెనమలూరు మండలం పోరంకిలోనూ ఓ పాజిటివ్ కేసు నమోదైంది. పాజిటివ్ వచ్చిన వ్యక్తుల కుటుంబ సభ్యులు, ఆయా ప్రదేశాల్లో వ్యక్తులు కలిసి మెలిసి తిరిగిన వ్యక్తులు, ఆయా కుటుంబాలకు ర్యాపిడ్ టెస్టులు, ఆ తర్వాత ఆర్‌టిపిసిఆర్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆయా కుటుంబాలను వైద్య ఆరోగ్యశాఖ అబ్జర్వేషన్‌లోకి తీసుకుంది. వారి ఆరోగ్య లక్షణాలను ఎప్పటికప్పుడు సిబ్బంది నిశితంగా పరిశీలిస్తున్నారు.



15 రోజులుగా వ్యాధి నిర్ధారణా పరీక్షలు

జిల్లాలో 15 రోజులుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జర్వపీడితులు, జలుబు, దగ్గ లక్షణాలతో బాధపడే వారికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. 10 రోజులపాటు రోజుకు సగటున 80 మందికి ఈ పరీక్షలు నిర్వహించారు. తాజాగా పాజిటివ్ కేసులు రావడంతో రోజుకు 110 మందికి టెస్టులు నిర్వహిస్తున్నారు. మరిన్ని టెస్టులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి
గీతాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

కరోనా నియంత్రణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలతో బాధపడుతున్న వారికి కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నాం. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు చికిత్స అందించడంతో పాటు వారి కుటుంబాలను, వారితో సన్నిహితంగా ఉన్న వ్యక్తులను గుర్తించి మా పర్యవేక్షణలో ఉంచుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రద్దీ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, ఇంటికి వచ్చిన వెంటనే హ్యాండ్ వాష్ చేసుకోవడం లాంటి జాగ్రత్తలు పాటించాలి.

రాజధానిలో పేదలకు ఇళ్లు

- వేగంగా అధికారుల చర్యలు
- 20 లేఅవుట్ల ఏర్పాటుకు కసరత్తు
- మౌలిక సదుపాయాలకు టెండర్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పేదలకు రాజధాని గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అధికారులు వేగంగా అడుగులు వేస్తున్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గత నెల 21న విడుదల చేసిన గెజిట్‌పై రైతులు హైకోర్టును ఆశ్రయించినా కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పటి వరకు నాలుగు నివాస జోన్లు ఉన్నాయి. ఇంతవరకు ఆర్-1 (ప్రస్తుత గ్రామాల్లోని నివాసాలు), ఆర్-2 (తక్కువ సాంద్రత కలిగిన గృహాలు), ఆర్-3 తక్కువ నుంచి మధ్యస్థాయి సాంద్రత కలిగిన గృహాలు), ఆర్-4 (హైడెన్సిటీ జోన్) పేర్లతో నాలుగు రకాల నివాసజోన్లు గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజధానిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలోని గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 48,218 మందికి ఉచితంగా ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అధికారులు ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించారు. ఈనెలాఖరులోగా వీరికి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిఆర్‌డిఏ పరిధిలో మొత్తం 1134.58 ఎకరాల భూమిని పేదల ఇళ్లకోసం కేటాయించారు. మొత్తం 20 లే అవుట్లలో



స్థలాలను ఇవ్వాలని నిర్ణయించారు. లే అవుట్ల ఏర్పాటుకు టెండర్లు కూడా పిలిచారు. రాజధాని గ్రామంతోపాటు పెండింగ్‌లో ఉన్న నిడమర్రు ప్రాంతంలో కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రు ప్రాంతాల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. సిఆర్‌డిఎ చట్టంలో సెక్షన్41 (3), (4)ల ప్రకారం ఆర్-5 జోన్‌ను ఏర్పాటు చేసింది. గత ఏడాది అక్టోబర్లో ప్రభుత్వం బహిరంగ విచారణ చేపట్టి అభ్యంతరాలు, సలహాలను స్వీకరించింది. చివరిగా ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది. ఈమేరకు సంబంధిత భూములను గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు వచ్చే నెల మొదటి వారంలోగా పనులు ప్రారంభించాలని సిఎం జగన్ ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాల లేఅవుట్లకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.



పెడనలో 'మా నమ్మకం నీవే జగనన్న' లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

'మా నమ్మకం నువ్వే జగనన్న' ప్రారంభోత్సవంలో మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - పెడన : భారతదేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేని సంక్షేమ పథకాలను అమలుపరిచిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అని గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన పెడనలోని వైసిపి కార్యాలయంలో "మా నమ్మకం నువ్వే జగనన్న' ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్క కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి కుటుంబానికీ నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అయ్యేలా సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. కొత్త రాజకీయానికి కొత్త వరవడి జగనన్న అన్నట్లుగా గత నాలుగేళ్ల పరిపాలన ఎలా జరిగిందో అనే దానిపై గడపగడపకు తిరుగుతూ ప్రతి ఇంటికి అండగా ఆసరాగా ఉంటామని తెలుపుతామని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలు (మిగతా 6లో)

కన్నుల పండువగా 'కృష్ణవేణి నదీ విహారం'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శుక్రవారం సాయంత్రం విజయవాడ కనక దుర్గమ్మ ఆలయంలో శ్రీ గంగా దుర్గామల్లేశ్వర స్వామివార్లకు ఆలయ వైదిక అర్చక సిబ్బందితో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను పల్లకీపై ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చారు. కృష్ణా నదీ తీరంవద్ద సిద్ధంచేసిన పంటుపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించారు. స్వామి అమ్మవార్లకు వేదపారాయణ, లలితా సహస్ర నామం, మంగళ వాయిద్యాలతో మూడు సార్లు వైభవంగా జలవిహారం నిర్వహించారు. పల్లకీపై ఊరేగింపుగా తిరిగి మహా మండపానికి చేరుకున్నారు. ఉత్తరాయణకాలం చైత్రమాసంలో వసంత నవరాత్రులు, అనంతరం శ్రీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిసారిగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల 'కృష్ణవేణి నదీ విహారం' నిర్వహించారు. ఇక నుండి ప్రతి సంవత్సరం ఉత్తరాయణ కాలంలో "కృష్ణవేణి నదీ విహారం' నిర్వహించేందుకు కృషి చేస్తామని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఒ దర్భముళ్ల భ్రమరాంబ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు, ఎంఎల్‌ఎలు వెలంపల్లి శ్రీనివాస రావు, మల్లాది విష్ణు, ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, చింకా శ్రీనివాస రావు, నంబూరి రవి, బచ్చు మాధవీ కృష్ణ, కేసరి నాగమణి, నిడమానూరి కల్యాణి, అల్లూరి కృష్ణవేణి, తొట్టడి వేదకుమారి, ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎల్.రమ, సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రమేష్, పంటు దాత బొర్రా క్రాంతి కుమార్, ఎసిపి హనుమంతరావు, ఇరిగేషన్ ఇఇ కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.




నదీ విహారంలో శ్రీ గంగా దుర్గామల్లేశ్వర స్వామివారలు; ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం; హాజరైన కలెక్టర్ ఎస్.డిల్లీరావు, ఎంఎల్‌ఎలు వెలంపల్లి, విష్ణు, ఆలయ చైర్మన్ రాంబాబు, ఇఒ భ్రమరాంబ (కింది ఫొటోలు)





రంజాన్ వేళలు

వారం		వేళలు
శనివారం	ఇఫ్తార్	6.40
ఆదివారం	సహరి	4.47





తిరువూరులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -తిరువూరు : రంజాన్ పండగను పురస్కరించుకుని ఉపవాసం ఉంటు న్న ముస్లిం సోదరులకు సిపిఎం తిరువూరు పట్టణ కమి టీ ఆధ్వర్యంలో శుక్రవా రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామియా మసీద్ లో పార్టీ నాయకులు, కార్యకర్త లు ఖర్జూర పళ్ళు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి మేకల నాగేంద్రప్ర సాద్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సర్వమత సమాన త్వానికి పత్రిక అన్నారు. సెక్యు లర్ భావజాలం ప్రజల్లో పెరి గేందుకు ఇలాంటి ఇఫ్తార్ విందు లు మరింతగా తోడ్పడతాయ న్నారు. ఈకార్యక్రమంలో సిపి ఎం సీనియర్ నాయకులు గుళ్ళ పల్లి వెంకటరత్నం, ఎస్వీ.భద్రం, ఎం.ప్రభాకరరావు, నూకల సత్య నారాయణ, పంతంగి శ్రీనివాస రావు, బి.వెంకటేశ్వరరావు, ఆకు ల రవి, పిల్లల కష్ణ, ఎస్.కె.సత్తా ర్, అభిమానులు ఎస్.కె.దాదు, పెంటుపులి, పంబి మణికంఠ, రెబ్బు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామికి వెండి గిన్నె వితరణ

ప్రజాశక్తి - గంపల గూడెం : శ్రీ వేణుగోపాల స్వామి వారికి శుక్రవారం వెండి గిన్నె బహుకరణగా అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం ముద్దు నూరుకు చెందిన పసుమర్తి రాంబాబు - నాగమణి దంపతులు బహుకరించగా 575 గ్రాములు తోకంగాల ఈ గిన్నెను ఆలయ పురోహితులకు అప్పగించినట్లు ప్రసాద్ వివరించారు.

ముస్లింల సంక్షేమానికి కృషి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-వీరులపాడు : ముస్లింల సంక్షేమానికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నా రని శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొ న్నారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఈద్గర్ గ్రౌండ్ పనులకు ప్రారంభించి మత పెద్దల సమక్షంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల జీవన ప్రమాణాలు పెరగాలని లక్ష్యంతో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానీ విధంగా ఆనాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. నందిగామ నియోజక వర్గంలో ముస్లింల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల రమేష్ బాబు మాజీ జెడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, గ్రామ సర్పంచ్ రామావత్ కోటి, సొసైటీ అధ్యక్షులు పూల రాంబాబు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో సిలువ ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుడ్‌ఫ్రైడే (పవిత్ర శుక్రవారం) సందర్భంగా పటమట సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ కర్తలు విజయవాడ కేథలిక్ డయోసిస్ మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం వందలాది మంది క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో బహిరంగ సిలువమార్గం ఆచరించారు. ఈసిలువ మార్గం సెయింట్ పాల్స్ కథెడ్రల్ నుండి ప్రారంభమై నిర్మలా కాన్వెంటు రోడ్డు, ఎన్‌టిఆర్ సర్కిల్, పంటకాలువ రోడ్డు, మారిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియం వరకు జరిగింది. దాదాపు గంటన్నరపాటు కొనసాగిన సిలువ మార్గం ప్రదర్శనలో యేసుక్రీస్తు సిలువ వేసేముందు అనుభవించిన కష్టాలు, శ్రమలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై యేసుక్రీస్తు సిలువను పరిశుద్ధ సిలువ ప్రదర్శనలో ఊరేగించారు. ఈసందర్భంగా కేథలిక్ డయోసిస్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ పాపుల రక్షణార్థమై యేసుక్రీస్తు సిలువ మరణం పొంది ప్రాణత్యాగం చేశారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీస్తు సిలువ మరణం పొందిన రోజున గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారన్నారు. మరణించిన క్రీస్తు ఈస్టర్ (పాస్కా) నాడు మూడవరోజు మరణాన్ని జయించిన మృత్యుంజయుడు కావడంతో ఈస్టర్ పండుగను ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో ఫాదర్ కె.కుమార్‌రాజా, ఫాదర్ వినయ్, చర్చి ప్రతినిధులు బండి బాబూరావు, మదిర బెర్నాడ్, అశోక్, రోశయ్య పాల్గొన్నారు.

అలాగే మానవాళి కోసం సిలువనెక్కిన యేసుక్రీస్తు మార్గంలో ప్రతిఒక్కరూ ఆదర్శవంతంగా జీవించాలని టీడీపీ నేత ఎంఎస్ బేగ్ అన్నారు. , గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం కేదార్వాశ్వరపేట ఆర్సీఎం చర్చి నిర్వహించిన సిలువ మార్గం యాత్రలో ఫాదర్ జేమ్స్ తో కలిసి ఆయన పాల్గొన్నారు యాత్రలో పాల్గొన్న వారికి టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ హబీబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కేదారేశ్వరపేట, శాంతినగర్ వీధుల్లో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు తస్లీమ భాను, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి సరేపల్లి రాధాకష్ణ, టీడీపీ మైనారిటీ సెల్ పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షుడు హబీబ్, విజయవాడ పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మరియన్న దాసు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, బురా కనకరావు, ఎర్రమా, దుర్గారావు, సాంబా, ఏసు, స్థానిక సంఘస్తులు పెద్దతున్న పాల్గొన్నారు. **ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల సిఎస్ఐ క్రైస్ట్ చర్చిలో రెవరెండ్ జి విశ్వనాథ్ దైవ సందేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నశించిపోతున్న సర్వ మానవాళి ని రక్షించేందుకు ఏసుక్రీస్తు సిలువలో తనను తాను అర్పించుకున్నారని అన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు :** గుడ్ ఫ్రైడే సందర్భంగా ముచ్చింతాల విశారణ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ శిలువ మార్గం నిర్వహించారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ దేవ కుమార్ పర్యవేక్షణలో క్రైస్తవ విశ్వాసులు ఏసు క్రీస్తు, భటుల వేషధారణ లో సిలువను మోస్తూ, పెనుగంచిప్రోలు, ముచ్చింతాల లోని ప్రధాన వీధులలో ప్రదర్శన జరిపారు. క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు జపిస్తూ, శ్రమల పాటలతో భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ప్రేమ, త్యాగాలకు ప్రతీకని, ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలను అనుసరిస్తూ, ప్రశాంతమైన జీవనం గడపాలని ఫాదర్ దేవ కుమార్ తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు సంఘపెద్దలు. కోలకాని. అర్జునరావు. పంద్రకోలా. శ్రీను. ఉదయ బాబు, మహిళలు పాల్గొన్నారు. **ప్రజాశకి- వత్సవాయి :** మండలంలోని కన్నివేడు, మక్కపేట, చిట్యాల, లింగాల, వత్సవాయి, ఖమ్మంపాడు, మంగోల్లు, తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సి ఎస్ ఐ, ఆర్.సి.యం, హెబ్రోన్, సెవెంత్ డే, ఐపిసిసి, ఐపిసి, తదితరు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థన కూటాలు ఏర్పాటు చేశారు. పాస్టర్లు సంఘపు ప్రశాంత్ కుమార్, కరిశ ఆనందరావు, ఆదం, జయరాజు,రత్నరాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడరూరల్ :** విజయవాడ రూరల్ లో శుక్రవారం అన్ని గ్రామాల్లోని చర్చి లలో ప్రత్యేక పూజలు జరిగాయి. నున్న లోగల యేసు తీరు హదయా దేవాలయం వారు బహిరంగా సీలువ మార్గం నిర్వహించారు. సేక్రెడ్ హార్ట్ చర్చ్ (నున్న) విశ్వాసులందరూ. బోడపాడు సెయింట్ జోసెఫ్ చర్చి నుండి సేక్రెడ్ హార్ట్ చర్చి నున్న వరకు సిలువ మార్గాన్ని యేసు ప్రభు యొక్క శ్రమలు,బాధను ప్రదర్శించారు. చాలమంది భక్తులు ఈ సిలువ మార్గంలో విశ్వాసంతో పాల్గొన్నారు. విచారణ గురువు జోషి ఆధ్వర్యంలో సహాయక గురువు లు, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- తిరువూరు :** గుడ్‌ఫ్రైడే సందర్భంగా తిరువూరు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ శిలువ మార్గం నిర్వహించారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో క్రైస్తవ విశ్వాసులు ఏసు క్రీస్తు, భటుల వేషధా రణలో సిలువను మోస్తూ, పట్టణంలో ని ప్రధాన వీధులలో ప్రదర్శన నిర్వహించారు. క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు జపిస్తూ, శ్రమల పాటల తో భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. మండలంలోని పలు క్రైస్తవ దేవాల యాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ విజయ్ కుమార్, క్రైస్తవ విశ్వాసు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి కంచికచర్ల :** స్థానిక అంబేద్కర్ కాలనీలో గల ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో తెల్లవారుజామున పెద్ద ఎత్తున జనం చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం శిలువ మోస్తూ కంచికచర్ల వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.గొట్టుముక్కల ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మోస్తూ ప్రదర్శన చేశారు. కీసర, పరిటాల, గండేపల్లి, కొత్తపేట, యస్ ఆమరవరం, వేములపల్లి తదితర గ్రామాల్లో శిలువ మోస్తూ ప్రదర్శన చేశారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** చిల్లకల్లు, గౌరవరం జయంతిపురం, బలుసుపాడు, అనుమంచిపల్లి, ముత్యాల వేదాద్రి, మల్కాపురం, గండ్రాయి, బోదవాడ తదితర గ్రామాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గయ్య పేట పట్టణం, చిల్లకల్లు గ్రామాల్లో రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో మలాదార్లు, భక్తులు వీధుల్లో తిరుగుతూ గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను 14 స్థలాల్లో ప్రత్యేక పూజలతో వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణం తొర్రగుంటపాలెం ది పెంతుకొస్తు చర్చి నందు గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా చర్చి నందు ప్రార్థన కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు శ్రీ సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.


విజయవాడలో...


వత్సవాయిలో...


తిరువూరులో...


జగ్గయ్యపేటలో...

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- ఐఎంఎ రాష్ట్ర కార్యదర్శి ఫణీంద్ర

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఫణీంద్ర తెలిపారు. స్థానిక కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా అతిధులచేత జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని హెల్త్ ఫర్ ఆల్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిట్టినగర్‌లోని కలర్ హాస్పిటల్, కేఎల్ రావు నగర్, లంబాడి పేట తదితర ప్రాంతాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి. ఫణీంద్ర, విజయవాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఏ రెహమాన్, కార్యదర్శి పి.వి. దుర్గారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మూర్తి, ఐఎంఏ ట్రెజరర్ ఆంధ్ర హాస్పిటల్ ప్రముఖ డాక్టర్ ఎం. రవీందర్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎన్.వి. రావు అధ్యక్షతన డాక్టర్లు మాట్లాడుతూ ఆరోగ్యం అంటే శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పుట్టిం దగ్గర నుంచి అనేక వ్యాక్సిన్లను బాల్యంలోనే ఇవ్వడం వల్ల చాలావరకు జబ్బుల్ని రాకుండా కాపాడుకుంటున్నామని, అందువల్లనే నేడు సగటు ఆయుషు 65 సంవత్సరాలు పైబడి ఉందని అన్నారు. అందరికి ఆరోగ్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమనందు స్మైల్ క్లబ్ చాప్టర్ సెక్రటరీ బిఎస్‌కే పట్నాయక్, క్లబ్ అధ్యక్షులు బి. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఆర్. సోమేశ్వర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.


వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అతిధులతో ఎన్‌వి రావు

వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చేతికి ఇన్ఫెక్షన్ .?

- బంధువుల ఆరోపణ
- వైద్యుల నిర్లక్ష్యం లేదు : ఆసుపత్రి సిబ్బంది

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ చేతికి తీవ్ర ఇన్ఫెక్షన్ అయ్యిందని మహిళ బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేటకు చెందిన తులసి ఇల్లు సర్దుకునే సమయంలో ఏదో తెలియని పురుగు కుట్టిందనే అనుమానంతో స్థానిక ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీనితో మహిళ చేతికి ఇన్ఫెక్షన్ తొలగించి కట్టు కట్టే సమయంలో సర్జరీ పరికరాన్ని చేతికి వేసి కట్టారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా ఇన్ఫెక్షన్ పెరిగిందని మీడియాలో వచ్చింది. దీనితో ఆసుపత్రి ఆర్ఎం.వో మంగాదేవి ప్రజాశక్తితో మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఇది జరగలేదన్నారు. కట్టు కట్టే సమయంలో క్లీన్ చేసి డ్రెస్సింగ్ చేస్తారని కాని బంధువులకు తెలియని కారణంగా వైద్యులు సరిగా కట్టలేదని ఏదో పరికరం ఉంచారని చెపుతున్నారని, ఇది వాస్తవం కాదని తెలిపారు.

మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ అంజనీ కుమార్

ప్రజాశక్తి-గన్నవరం : ఆరోగ్యాన్ని మించిన ధనం లేదని, అందువల్ల ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు కలిగి వుండాలని ప్రముఖ షుగర్ వైద్యులు సి. అంజనీ కుమార్ అన్నారు.స్థానిక విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, గన్నవరం శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. అంజనీ కుమార్ మాట్లాడుతూ... మారుతున్న సమాజంలో ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు వేగంగా జరుగుతున్నాయని, యువకులు ఎక్కువమంది జంక్ ఫుడ్ లకు అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా షుగర్, బి పీ, క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని వీటి బారిన పడకుండా ఉండాలంటే పోషకాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలని చెప్పారు. రోగం వచ్చాక బాధపడటం కన్నా అది రాకుండా చూసుకోవడం మంచిదని వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు, పెన్షన్ దారులు, మహిళలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి వైద్యులు మందులు రాశారు. ఎన్టీఆర్ ట్రస్ట్,హైదరాబాద్ వారు ఉచితం గా మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా గన్నవరం లోని లక్ష్మమ్మస్ స్మైల్ అండ్ షైన్ దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్ రాజు, స్పందన దంత రోగులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్. వెల్ఫేర్ అసోసియేషన్, కష్ణాజిల్లా శాఖ జనరల్ సెక్రెటరీ మోతుకూరి వెంకటేశ్వర రావు, రిటైర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ,గన్నవరం సెక్రెటరీ వలి, ట్రెజరర్ బి. కష్ణా రావు ,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ చిన్ని మాధవి, రిటైర్డ్ అధ్యాపకులు గన్నే వెంకటరావు, ఎం . ప్రభాకర చౌదరి, డాక్టర్ మద్దు కూరి విజయ కుమార్, వి. వి కష్ణ మోహన్, జాస్తి తాతారావు, కొత్తంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. 250 మంది వైద్య శిబిరాన్ని ఉపయోగించుకున్నారు.

తేలప్రోలులో కరోనా కలకలం

ప్రజాశక్తి-గన్నవరం : ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడం కలకలం రేపింది. ఆ గ్రామానికి చెందిన బసవయ్య అనే వ్యక్తి జ్వరం, జలుబు, దగ్గు తో శుక్రవారం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చాడు. అనుమానంతో వైద్యులు కోవిడ్ పరీక్ష చేస్తే పాజిటివ్ అని రావడంతో బసవయ్య ఆందోళనకు గురయ్యాడు. బసవయ్యను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి కి మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఇదిలా ఉండగా తేలప్రోలు గ్రామంలో అధికారులు అలర్ట్ అయ్యారు.



హనుమాన్‌జంక్షన్లో అన్నదానం

ప్రజాశక్తి-గన్నవరం : అన్నం పరబ్రహ్మ స్వరూపం అటువంటి అన్నదానాన్ని బాపులపాడు మండలం నూజివీడు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర బిల్డింగ్ మెటీరియల్ నిర్వాహకులు చీపు నాగరాజు, మహాలక్ష్మి దంపతులు శుక్రవారం 120 మందికిపైగా నిరుపేదలకు నిస్వార్ధంగా అన్నదానం చేశారు. మనం మన కోసం చేసేది మనతోనే పోతుందని ఇతరుల కోసం చేసేది శాశ్వతంగా నిలిచి ఉంటుందని నాగరాజు అభిప్రాయం. అందుకే ఈ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం గత నాలుగు సంవత్సరాలుగా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే దారిలో ముత్యాలమ్మ గుడి వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ,చారిటబుల్ ట్రస్టు లు సైతం నిర్వహించలేని ఇటువంటి మహత్కార్యాన్ని వ్యక్తిగా నాగరాజు నిర్వహించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. కరోనా సమయంలో సైతం సమాజానికి తన వంతుగా నాగరాజు చేసిన ఈ కార్యక్రమం నిస్వార్ధానికి ప్రతీకగా నిలుస్తుంది.

'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీ నుండి 20వ తేదీ వరకు అభివృద్ధికార్యక్రమాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరిస్తామని ఎంపీపీ కొడాలి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు, బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఎంపీపీ సమావేశపు హాల్లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ప్రజల సమస్యలను గుర్తించి అధికారం వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో 98శాతం సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు జగన్ అందించారన్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి మాట్లాడుతూ గహ సారథులు, వాలంటీర్లు గ్రామాల్లో గహాలను సందర్శించి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాల పై వారి అభిప్రాయాలను సేకరిస్తారని తెలిపారు. గ్రామంలో ప్రజ



లకు ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని సేకరించి ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తామని తద్వారా సమస్యలు పరిష్కరించేందుకు జగన్ కషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు కోటప్రోలు శివ నాగ జయప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ సాయిన రవికుమార్, తాళ్లూరి మాధవ, సాయిన దుర్గాప్రసాద్, మహా రెడ్డి మురళి, గూదే రవి, జితేంద్ర, కిషోర్ నాయుడు, కొడాలి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్‌జంక్షన్) : బాపులపాడు మండలం, బొమ్ములూరులో అక్ర మంగా సాగుతున్న మట్టి తవ్వకాలను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. ప్రైవేట్ వ్యక్తులు ప్రోక్లైన్ పెట్టి మట్టిని ట్రాక్టర్ల ద్వారా కొక్కిరిపాడు, బోగాపురం, కొయ్యూరు, బొమ్ములురు గ్రామాలకు అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారని గ్రామానికి చెందిన యువకులు మండిపడ్డారు. మట్టి తోలకం వల్ల తమ గ్రామానికి ఏ విధమైన ఉపయోగం లేదని ట్రాక్టర్ డ్రైవర్లపై ధ్వజమెత్తారు. మా ఇష్టం అంటూ డ్రైవర్లు అడ్డం తిరగడంతో గొడవ జరిగింది. గ్రామానికి చెందిన పెద్దలు, పంచాయతీ బోర్డు సభ్యులు రంగంలోకి దిగి మట్టి ట్రాక్టర్లు నిలుపుదల చేశారు. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి మట్టితో ఎందుకు ఉపయోగించిన ప్రోక్లైన్ ను ఫోటో తీశారు. మట్టి తరలించే వారిపై కేసులు పెడతామని రెవిన్యూ అధికారులు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సభ్యులకు బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రతి ముఖ్య దినోత్సవం సందర్భంగా తమ అసోసియేషన్ ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తోందని అసోసియేషన్ అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీసం ప్రసాదరావు, కోశాధికారి గంప సాంబశివరావు, వాకర్ డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ కే.ఎన్. బాబూరావు, పలువురు వాకర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు భోజనం పంపిణి చేశారు. స్థానిక శాంతి వృద్ధుల అశ్రమంలో పేరూరు మాజీ సర్పంచ్ సోమ సత్యానారయణ పుట్టినరోజును పురష్కరించుకుని వృద్ధులకు భోజనం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మాకుల సత్యం, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు యలమర్తి కష్ణారావు, గోరిపర్తి సతీష్‌కుమార్ ,కంతేటి హరిబాబు, వీర్ల రాంబాబు, వి.అభినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-గుడివాడ : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. శుక్రవారం స్థానిక మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో లక్ష్యంగా వైసిపి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలు తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు మండలి హనుమంతరావు, ఎంవి.నారా యణరెడ్డి, మెరుగుమాల కాళీ, మలిరెడ్డి రవిరెడ్డి, చింతల భాస్కరరావు, వీరిశెట్టి నరసింహారావు. తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటన

ప్రజాశక్తి-నాగాయలంక : ఓడిఎఫ్ కేంద్ర ప్రభుత్వ బందం నాగాయలంక మండలంలో విస్తత పరిశీలనలు నిర్వహించింది. మండల కేంద్రమైన నాగాయలంక గ్రామపంచాయతీ పరిధిలో ఓడిఎఫ్ టీం లీడర్ కడియాల కుమార్, రాము ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి జె.హెచ్.వి పవన్ కుమార్ పర్యవేక్షణలో కడియాల కుమార్ అంగన్ వాడీలు, డ్రైనేజీ వ్యవస్థ, పంచాయతీ కార్యాలయం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, పాఠశాలలను పరిశీలించారు. సర్పంచ్ కైతేపల్లి. అంకాలు ,గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామ పరిధిలో బి.వి తోటలో కల్లుగీత పెన్షన్ పొందుతున్న ఒక నిరుపేద కుటుంబానికి చెందిన తుమ్మా నీలా అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. గ్రామంలోని తోటీ పెన్షన్‌దారులు తలో వంద రూపాయలు వేసుకుని మొత్తం 40,050 రూపాయలను నీలా భార్య వెంకటేశ్వరమ్మకి శుక్రవారం అందజేసారు .ఈ కార్యక్రమంలో గ్రామ ఇంచార్జి మట్టా మోహన నాంచారయ్య,సచివాలయ కన్వీనర్లు, గహ సారదులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.



వైభవంగా కళ్యాణ మహోత్సవం



ప్ర జా శ క్తి - పెనుగంచి ప్రోలు : స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ నందు గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో కళ్యాణ మహొత్సవం ఆలయ అర్చకులు పరం కుశ సీతా రామ చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, బాలకష్ణ చార్యులు పర్యవేక్షణలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు . ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు దంపతులు కళ్యాణ పీటలపై కూర్చుని సంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపిం చారు. ఈకార్యక్ర´మంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

లీకేజీ పైపులను మార్పు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో లీకేజీలవుతున్న వాటర్ పైపులను మార్పు చేయాలని స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు వీఎంసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల స్థానిక ప్రజలు కార్పొరేటర్ బోయి సత్తిబాబు దష్టికి పైపుల లీకేజీ విషయాన్ని తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులకు ఫిర్యాదు చేసి లీకేజ్ అవుతున్న పైపులైను మార్పు చేసి మంచినీటి వధా అరికట్టే విధంగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం పైపుల లీకేజీ పనులను కార్పొరేటర్ సత్యబాబు పరిశీలించారు. అలాగే పాడైన పైప్ లైన్లు,బోరింగులు బాగు చేయాలని కోరారు. తగిన సిబ్బందిని నియమించి త్వరితగతిన వేసవి మంచినీటి ఇబ్బందులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు కార్పొరేటర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు



వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: స్పందించే హదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వద్ధులకు నూతన వస్త్రాలు అందచేసారు. ఏలూరు జిల్లా



నూజివీడుకి చెందిన పసుపులేటి రవికాంత్ ఆర్థిక సహాయంతో, వారి మాతమూర్తి రాజకుమారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం భవానీపురంలోని శ్రీ వెంకట సాయి వద్ధాశ్రమంలోని 24 మంది వద్ధులకు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. చీరలు, పంచలు, నైటీలు, టవల్స్ పంపిణీతో పాటుగా, వద్ధులకు ప్రత్యేక మెనూతో, మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది మాసాలలో ముఖ పుస్తక మిత్రులు , పలువురి దాతల ఆర్థిక సహకారంతో, తెలుగు రాష్ట్రాలందు వివిధ ప్రాంతాలలో, 23 సేవా కార్యక్రమాల్ని, నిర్వహించామని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. ప్రకాశం జిల్లా కంభం నుండి మొదలైన తమ సేవా కార్యక్రమాలు నేడు రెండు రాష్ట్రాల్లో విస్తతంగా జరుగుతున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవీ సుకన్య, షేక్ చాంద్ బాషా, శ్రీనివాస్‌రావు, సిహెచ్ ప్రభాకర్‌రావు, సూర్యకుమారి, స్వర్ణలత, నాగరాజి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : వసంత

ప్రజాశక్తి-మైలవరం: తారక రామానగర్‌లో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల



సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా శాసనసభ్యులుగా, మంత్రిగా పనిచేసిప్పటికీ తారక రామ్ నగర్ (దేవుని చెరువు)లో గత శాసనసభ్యుడు చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. ఇటీవల తాను నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దేవుని చెరువులో అనేక సమస్యలను స్వయంగా చూశారని, మరికొన్ని ప్రజలు తెలియజేశారన్నారు. గత శాసనసభ్యుడి హయాంలో పదేళ్ళలో కేవలం ఒక్క సిమెంట్ రోడ్డు మాత్రమే నిర్మిస్తే, తను గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఆరు రహదారులను సిమెంట్ రహదారులుగా అభివద్ధి చేశామన్నారు. ఐదు ప్రధాన డ్రెయిన్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. మరో రూ.40 లక్షల నిధులు తాజాగా మంజూరు చేశామన్నారు. ఇవి కాక గడప గడపకు మన ప్రభుత్వం మైలవరంలో మూడు సచివాలయాల్లో పూర్తి అయితే మరో రూ.60 లక్షలు నిధులు మంజూరవుతాయన్నారు. వీటితో కూడా ముమ్మరంగా అభివద్ధి పనులు చేపట్టనున్నట్లు వసంత స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి కళ్యాణం గురువారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి



ఉత్సవమూర్తులను కొండపైన ఆలయం నుంచి ఊరేగింపుగా కొండ క్రింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు. ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను ఆయన సతీమణి సామినేని విమలభాను ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ఇఒ శ్రీరామ వరప్రసాదరావు పాల్గొన్నారు.

రిలయన్స్‌లో తంజావూరు కలెక్షన్స్


ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అక్షయ తృతీయ సందర్భంగా రిలయన్స్ జ్యూవెలర్స్ తంజావూరు కలెక్షన్స్‌ను ఆవిష్కరించినట్లు రిలయన్స్ జ్యువెల్స్ సీఈవో సునీల్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తంజావూరు కలెక్షన్స్ వివాహాలు, శుభ కార్యాల సందర్భంగా ప్రత్యేక ఆభరణాలను అందిస్తున్నామన్నారు. ప్రదానంగా నెక్లెస్ సెట్లు, చోకర్లు, లేయర్డ్ నెక్లెస్, బ్యాంగిల్స్, బ్రాస్‌లెట్లు, చెవిపోగులు, ఉంగరాలు, నడుబు బెల్ట్‌లు, మాంగ్టిక్కాస్, ఇయర్ చెయిన్‌లు, మరిన్ని ఉంటాయన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారు ఆభరణాలను ధరించేందుకు ఇష్టపడతారని అందులో భాగంగానే ప్రత్యేక కలెక్షన్స్ ఎక్స్‌క్లూజివ్‌గా అందిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో చంద్రబాబుకి జగనన్నకి మధ్య తేడాను ప్రజలకు వివరిస్తామని విజయవాడపశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలు సేకరించబోతున్నామన్నారు. ఈ నెల 25న ప్రజల ముందర రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయాలను బహిరంగంగా తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, వైసీపీ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, జిఎంసి బాషా తదితరులు పాల్గొన్నారు. స్థానిక 50వ డివిజన్ 177వ సచివాలయం పరిధిలో వెలంపల్లి శ్రీనివాసరావు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమాని అనుమతితో డోర్ స్టిక్కర్‌లను అంటించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ వైసీపీ పార్టీ ఇంచార్జి బంకా విజయ, నాయకులు కొనకళ్ల విద్యాధరరావు, సయ్యద్ అతీక్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, బంక శివ, బంక చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కంచికచర్లలోని మూడు సచివాలయాల పరిధిలో సర్పంచ్ వేల్పుల సునీత, పట్టణ వైసిపి అద్యక్షుడు వేమా సురేష్ బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, వైసిపి నాయకులు వేల్పుల శ్రీనివాస్, ఎంపిటిసి వేమా రోజా రమణి తదితరులు వసంత కాలని, గొట్టుముక్కల రోడ్డు, అరుంధతి కాలనీ, అంబేద్కర్ కాలనీ, జుజ్జూరు రోడ్డు, 1వ వార్డు, మోడల్ కాలనీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రంధి ఆదిత్య, దాసరి రాజా, ఉప్పు స్వామి, శేషం వాసుబాబు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్:** కొత్త రాజీవ్ నగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, నాయకులు మోదుగుల గణేష్, సిహెచ్ రవి, టెక్యం కష్ణ, నాగు, సామ్రాజ్యం, భవానీ సాయి, రాజేశ్వరి, కన్వీనర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ రూరల్:** నిడమానూరు గ్రామంలో వైసిపి గ్రామపార్టీ అధ్యక్షులు పరిమి వంశీ ఇంటి ఆవరణలో శుక్రవారం రామవరప్పాడు ,ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలకు చెందిన సచివాలయాల కన్వీనర్లకు సాధం వెంకటేశ్వరరావు అధ్యక్షతన కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు రాజు, ఎఎంసి మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు(కోట్లు), జడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణ రాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, రాష్ట్ర నాయి బ్రాహ్మణ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యార్కారెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** గ్రామంలో సచివాలయం 3 పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, తోటచర్ల గ్రామంలో జెడ్పీటీసీ నాగమణి, ఎంపీపీ గాంధీ, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గంపలగూడెం:** గంపలగూడెంలో గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు ఇంటింటికీ తిరిగారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెంలో వంశీ కొత్తకొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక చంద్రబాబు నగర్‌లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్తూ జగన్ ప్రభుత్వంలో జరిగిన మంచిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ పరిశీలకులు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్న జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఉదయభాను పిలుపునిచ్చారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, వాలంటీర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలో, పట్టణంలో ప్రారంభించాలని తెలిపారు. పట్టణంలోని అద్దాల బజార్, తోర్రగుంటపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ యువజన నాయకులు







సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్ పూసల పుల్లారావు, కో ఆప్షన్ చైతన్య శర్మ పాల్గొన్నారు. షేర్ మహమ్మద్‌పేట గ్రామంలో జొన్నభట్ల సతీష్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జగన్ స్టిక్కర్లు తొలగింపు

కంచికచర్ల మండలంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఇంటి యజమాని అనుమతి లేకుండా అంటించిన సిఎం జగన్ స్టిక్కర్లను కొందరు వెంటనే తొలగించారు. పలుచోట్ల ఇంటి యజమానులు వద్దంటున్నా వాలంటీర్లు ఏకపక్షంగా స్టిక్కర్లు అంటించారు. జగన్ స్టిక్కర్లు ఇష్టంలేని కొందరు వాలంటీర్లు, గృహ సారధులు వెళ్లిపోయిన వెంటనే తొలగించారు.

అధికారంలోకొస్తే తెల్లకార్డుదారులకు ఉచిత ఇసుక

జనసేన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి మహేష్



ప్రజాశక్తి-వన్‌టౌన్: జనసేన ప్రభుత్వంలోకి రాగానే తెల్లకార్డులపై ఉచిత ఇసుక పథకం అమలుచేస్తుందని జనసేన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్ చెప్పారు. శుక్రవారం రెండో రోజు ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం 44వ డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. తొలుత నాలుగు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పోతిన మహేష్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సీఎం జగన్ తీసుకొచ్చిన ఇసుక పాలసీ వల్ల పనులులేక ఇతర ప్రాంతాలకు మగవారు వలసలు వెళ్ళిపోతున్నారని, కుటుంబాలు విడిపోయి బతకాల్సిన దుస్థితి వచ్చిందని ఘాటుగా విమర్శించారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు కార్పొరేటర్ అందుబాటులో లేరని, అదేవిధంగా సమస్యలు చెప్పుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేసారని చెప్పారు. ఈ డివిజన్‌లో సమస్యలు తిష్టవేశాయని, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో సమస్యల తీవ్రంగా ఉన్నాయని, మెట్లమార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అదే విధంగా సితార సెంటర్ వద్ద స్టేడియం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నామని, అక్కడ టిడ్కో ఇళ్ల గహ సముదాయం నిర్మించాలని మహేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన డివిజన్‌ల అధ్యక్షులు కొరగంజి వెంకటరమణ, బొమ్ము రాంబాబు ,రెడ్డిపల్లి గంగాధర్, తిరుపతి అనూష, బత్తుల వెంకటేష్, సిగానంశెట్టి రాము, పొట్నూరి శ్రీనివాసరావు, తమ్మిన లీలా కరుణాకర్, సోమి గోవింద్, ఏలూరు సాయి శరత్, సంజీవరావు,స్టాలిన్ శంకర్, బోట్టా సాయి, తదితరులు పాల్గొన్నారు.



43వ డివిజన్లో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-వన్‌టౌన్: 43వ డివిజనులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టిడిపి డివిజన్ అధ్యక్షుడు దూది బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి ఈ కార్యక్రమంలో భాగంగా 43వ డివిజన్ అధ్యక్షుడు దూది బ్రహ్మయ్య, కస్టర్ ఇంచార్జి కరీముల్లా, గాలిషా , కొనికి కొండయ్య పాల్గొని ఊర్మిళానగర్, ఏకలవ్య నగర్‌లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన సమస్యలు మురుగు నీటి పారుదల లేని డ్రైనేజీ, దోమలు ఎక్కువగా ఉండటం వల్ల డెంగు, మలేరియా జ్వరాలు వచ్చి హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు తెదేపా నాయకుల దష్టికి తెచ్చారు. అలాగే ఏకలవ్యనగర్‌లో ఇళ్ళకు రిజిస్ట్రేషన్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. అతి ముఖ్యమైన విషయం టిడ్కో ఇళ్ల కోసం నగదును కట్టించుకొని ఇంత వరకూ లబ్ధిదారులకు వాటిని కేటాయించని దుస్థితిని తెదేపా నాయకులు ముందు తమ గోడుని వెళ్లబుచ్చారు. ఈ సమస్యలపై ఈ సందర్భంగా దూది బ్రహ్మయ్య మాట్లాడుతూ అన్ని సమస్యలూ తీరాలంటే తెదేపా పాలన కోసం రానున్న ఎన్నికల్లో అందరూ సైకిల్ గుర్తుపై ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పన్న, నరసింహ, ఈశ్వరమ్మ, మహిళలు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్య

ఎన్‌టిటిఎఫ్ వార్షికోత్సవంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ విజయ భాస్కర్

ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్రంలో ప్రయివేట్ యాజమాన్యంలో పనిచేసే శిక్షణా కేంద్రాల్లో అదనపు ల్యాబ్ సౌకర్యం గల ఏకైక శిక్షణ కేంద్రం గన్నవరం ఎన్‌టిటిఎఫ్ అని ఎపి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ కె.విజయభాస్కర్ కితాబు ఇచ్చారు. గురువారం రాత్రి జరిగిన ఎన్‌టిటిఎఫ్ 2022-2023 వార్షికోత్సవ వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు ప్రిన్సిపాల్ దండమూడి మహీధర్ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మహీధర్ వార్షిక నివేదిక సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు సాంకేతిక విద్యను అందించేందుకు ఎన్‌టిటిఎఫ్ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రారంభించిన గన్నవరం ఎన్‌టిటిఎఫ్ ఆయన ఆశయ సాధనకు ఎంతో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో ఎంతోమంది విద్యార్థులకు బంగారు బాట వేసిందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక విద్యకు మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. డిప్లమో కోర్సులు చదివిన వారికి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎన్‌టిటిఎఫ్ లాంటి సంస్థల్లో చదివిన వారికి అతి తక్కువ సమయంలోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇంజనీరింగ్ రంగంలో నేడు అనేక ఆధునీకరణ మార్పులు చోటు చేసుకుంటు న్నాయన్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆ మెళుకువలను నేర్చుకోవాలన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలకు మరింతగా పదును పెడితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చునన్నారు. పాలిటెక్నికల్, ఇతర టెక్నికల్ కోర్సులు, ఇంజనీరింగ్ కోర్సులు చేరిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చునన్నారు. ఎన్‌టిటిఎఫ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులే వెన్నెముక లాంటి వారన్నారు. తల్లిదండ్రుల సమావేశానికి అత్యధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరు కావడం విశేషమన్నారు. మరో అతిథిగా ప్రయివేటు పాఠశాలల సంఘ అధ్యక్షులు జి.మోహన్ రావు మాట్లాడుతూ దేశంలో అన్ని విద్యాసంస్థలు సాఫ్ట్వేర్ రంగం వైపు దూసుకుపోతున్న నేపథ్యంలో హార్డ్వేర్ రంగాన్నే ఎంచుకునే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన సాంకేతిక విద్యను అందించటం అభినందనీయమన్నారు. ఎన్‌టిటిఎఫ్ యాజమాన్య కమిటీ ఉపాధ్యక్షురాలు కల్పన, నేషనల్ లీడర్ సతీష్ జోషి మాట్లాడుతూ గన్నవరం ఎన్‌టిటిఎఫ్ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. అనంతరం స్పోర్ట్స్ కల్చరల్ అకాడమిక్ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా 33 సంవత్సరాలుగా సుదీర్ఘకాలం పనిచేస్తున్న కళాశాల మేనేజర్ పద్మజ దంపతులను ముఖ్య అతిథి విజయ భాస్కర్ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకర్షించాయి. ఎన్‌టిటిఎఫ్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల చరిత్రలు స్క్రీన్‌పై ప్రదర్శించడంతో తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవటానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.



ఎన్‌టిటిఎఫ్ కళాశాలవార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న విజయభాస్కర్


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు


స్కిట్‌లో పాల్గొన్న విద్యార్థులు


మేనేజర్ పద్మజ దంపతులను సత్కరిస్తున్న విజయభాస్కర్

బందరులో కుక్కలతో భయం..భయం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

నగరంలో ఉన్న 50 డివిజన్లలోని ప్రజలు దోమలు, పందులు, కుక్కల బెడదతో పలు ఇబ్బందులకు గురౌతున్నారు. ముఖ్యంగా రాత్రి పూట నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలకే కాదు పెద్దలకు కూడా ముప్పు పొంచి ఉంది. కుక్కలు విపరీతంగా పెరిగి పాదచారులు, విద్యార్థులు వాహనదారులను వెంబడిస్తూ తీవ్ర గాయాలపాల్జేస్తున్నాయి. నియంత్రణకు చర్యలు తీసుకునేలా నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. టీడీపీ కార్పొరేటర్లు గతంలో కుక్కల బెడద నుండి తప్పించాలని కోరుతూ కలెక్టరుకు వినతిపత్రం అందించిన విషయం విధితమే. ఇదే విషయంపై పలుమార్లు మున్సిపల్ కమిషనరు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కుక్కలు స్వైరవిహారం

కాలనీలు, బస్తీల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. చిన్నపిల్లలకే కాదు పెద్దలకు కూడా వీటి బెడద తప్పడం లేదు. కార్పొరేషన్లలో వెటర్నరీ విభాగాలున్నా, అవి నామమాత్రంగా కొనసాగుతున్నాయి. వీధి కుక్కలు పెరిగిపోవడానికి ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదవడానికి కార్పొరేషన్లో అధికార యంత్రాంగాల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మచిలీపట్నం కార్పొరేషన్లో వీధికుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు తక్కువేనన్న విమర్శలూ ఉన్నాయి. కార్పొరేషన్‌లో కుక్కల సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలను నిలిపివేసినట్లు తెలుస్తోంది.


బందరు వీధుల్లో కుక్కల దండు

నియంత్రణ చర్యలు శూన్యం

ఒక కుక్క దాని పిల్లలు కలిపి ఏడాది కాలంలో దాదాపు 42 కుక్క పిల్లలను పెడతాయి. వాటి పిల్లలు, పిల్లల పిల్లలు ఇలా మొత్తం ఏడేళ్ల కాలంలో దాదాపు 4 వేల కుక్కలు పుడతాయని అంచనా. ఇలా కుక్కల సంతతి అభివృద్ధి చెందుతున్నా వాటిని తగ్గించే కార్యక్రమాలు అంత చురుగ్గా సాగడం లేదు. దీంతో వీధికుక్కల సంఖ్య తగ్గడం లేదు.

స్టెరిలైజేషన్‌తోనే నియంత్రణ:

వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గమని వెటర్నిటి డాక్టర్లు చెబుతున్నారు. అంటే కుక్కల పునరుత్పత్తి ప్రక్రియను నియంత్రించేలా శస్త్రచికిత్సలు చేయడం. మొత్తం కుక్కల్లో ఆడకుక్కలన్నింటికీ ఒకేసారి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు జరిగితేనే కుక్కల సంతతి తగ్గుతుంది. ఏటా వేలాది కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు ఆయా కార్పొరేషన్ల వెటర్నరీ విభాగాల అధికారులు చెపుతున్న మాటలన్నీ డొల్ల మాటలేనని కుక్కల సంఖ్య పెరిగిపోతున్న తీరు స్పష్టం చేస్తోంది.

ఆడకుక్కలన్నిటికీ ఆపరేషన్లు చేయాలి :

జైపూర్, గోవాల్లో ఈ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. ఆడ కుక్కలన్నింటికీ ఆపరేషన్లు చేయడంతో పాటు మగవాటికి సంతానోత్పత్తి వయసు వచ్చే సమయంలోనే (8 నుంచి 12 నెలల మధ్య) సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తారు. వీటితో పాటు 'మిషన్ ర్యాబిస్' పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తారని, కుక్కల బారిన పడకుండా ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలుస్తోంది. ఇకపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.


ఏ వీధిలో చూసినా ఇదే తంతు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : రావి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

రాష్ట్రంలో వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రావి వెంకటేశ్వరావు విమర్శించారు. గుడ్లవల్లేరు మండలంలోని కూరాడ గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెందాలంటే టిడిపి తిరిగి అధికారం చేపట్టాలన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందని వివరించారు. గ్రామ టీడీపీ నాయకులు కల్యాణపు నవాబు, బాసా రామచంద్రావు, బొర్రా నాగేశ్వరావు, శాయినా దుర్గా, శీరం నాగ రమేష్, పులి ప్రసాద్, మాదాసు ప్రసాద్, లంకా గణపతి ఆకుల శివయ్య. పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇదేమి కర్మ కార్యక్రమాన్ని శుక్రవారం పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెరిగిన విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాల్జేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి, యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజమోహనరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, అన్నపురెడ్డి వెంకటేశ్వరరావు, యలవర్తి చిన్న, లుక్కా శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, బర్మా శ్రీనివాసరావు, బండే రాఘవ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో



అవనిగడ్డలో

అరుణాచలం యాత్రకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ డిపో మేనేజర్ హనుమంతరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి ప్రతినెలా పౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షణ చేసుకునేందుకు ప్రత్యేక బస్ సర్వీసును నడపనున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున గిరి ప్రదర్శన కోసం ప్రత్యేక లగ్జరీ సర్వీసు బస్సును మే మూడో తేదీ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరి నాలుగో తేదీ ఉదయం శ్రీకాళహస్తి దర్శనం చేసుకుని మధ్యాహ్నం కాణిపాకం, సిరిపురం, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని అదే రోజు రాత్రి బయలుదేరి ఐదో ఉదయం అరుణాచలం చేరి గిరి ప్రదర్శన చేసుకుని అక్కడ నుండి బయలుదేరి అవనిగడ్డకు చేరుతుందని చెప్పారు. రూ.3000 టికెట్ ధరను నిర్ణయించామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా హనుమంతరావు కోరారు. టిక్కెట్ల కోసం ఆన్‌లైన్‌లో ఏటీపీ ఏజెంట్ల వద్ద టికెట్ రిజర్వేషన్ కౌంటర్ల వద్ద రిజర్వేషన్ చేయించుకోవాల్సిందిగా డిపో మేనేజర్ హనుమంతరావు కోరారు.





నేరాల నివారణపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజా సెంటర్, కోమల విలాస్ సెంటర్ ప్రాంతాల్లో నేరాల నివారణపై చేరువ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది దిశ యాప్ వల్ల కలిగే ఉపయోగాలు, సైబర్ నేరాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎల్‌హెచ్‌ఎంఎస్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం, మహిళా సంబంధిత నేరాలు, చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాలు, నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఇడి స్క్రీన్ పై ప్రదర్శించి అవగాహన కల్పించారు.



గుడ్‌ఫ్రైడే సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : గుడ్ ఫ్రైడే సందర్భంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన విజయవాడ రాణిగారితోట సెంటర్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు, ప్రజానీకానికి కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కె.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆదాం, శౌరి, మోహన్ రావు, కష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నిత్య ఆర్జిత సేవలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతికళ్యాణం తదితర సేవలు నిర్వహించారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయల ఇఒ దర్భముళ్ల భ్రమరాంబ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

(మొదటి పేజీ తరువాయి)

అందుతున్నాయా లేదా అడిగిమరీ తెలుసుకుంటామన్నారు. ఇంటి వద్దకే రేషన్, ఇంటి వద్దకే పెన్షన్ అమ్మఒడి, కాపు నేస్తం, రైతు భరోసా, ఆసరా, నేతన్న నేస్తం ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి అందేలా చేశామని పేర్కొన్నారు. అంతేగాక ఇటీవల గహ సారధులను కూడా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి స్థానిక 20వ వార్డులో "మా నమ్మకం నువ్వే జగనన్న" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు తన్నేరు నాగేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాదు, కొసనం కరుణకుమారి, బల్ల గంగయ్య, కోమట్ల అనిల్, బైలపాటి చిన్నారావు, నల్ల నాగలక్ష్మి, బొడ్డు శ్యామల, కోడూరి శ్రీనివాసరావు, మహేష్, పలువురు వైసిపి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో

తాగునీరు, విద్యుత్ సరఫరాకు ప్రతిపాదనలు

అధికారులకు కలెక్టర్ ఢిల్లీరావు



ప్రజాశక్తి - విజయవాడ

జగనన్న కాలనీల్లో శాశ్వత తాగునీరు, విద్యుత్ సరఫరా సౌకర్యం ఏర్పాటుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గహ నిర్మాణాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా ఏర్పాట్లపై శుక్రవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి మాసాంతానికి 10,972 గహ నిర్మాణాలను పూర్తి చేయాలనీ లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 10,300 గహాల నిర్మాణం పూర్తిచేసినట్లు చెప్పారు. మిగిలిన 472 నిర్మాణాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గహ నిర్మాణాలకు తాత్కాలిక ప్రాతిపదికన తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణం పూర్తయి గహ ప్రవేశాలకు సిద్ధమవుతున్న తరుణంలో లబ్ధిదారులకు శాశ్వత ప్రాతిపదికన విద్యుత్, తాగునీరు సరఫరా ఏర్పాట్లను చేపట్టాల్సి ఉందన్నారు. మండల యూనిట్ ప్రాతిపదికన తాగునీరు సరఫరా చేసేందుకు పెద్దమొత్తంలో ఖర్చవుతుందనే కారణంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకురావడంలేదన్నారు. విలేజ్ లెవల్ యూనిట్‌గా తీసుకొని పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తే గుత్తేదారులు ముందుకొచ్చి అవకాశం ఉందన్నారు. గహ నిర్మాణం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, మున్సిపల్, మండల అధివద్ధి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతి లే అవుట్లో చేపట్టాల్సిన శాశ్వత పనులపై అవగాహన కలిగి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. జగనన్న కాలనీల్లో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ విద్యుత్ సరఫరా వంటి విషయాల్లో భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకొని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి కాలనీలో పైపు లైన్ల ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతంలో లబ్ధిదారులకు కొండపల్లి, వెలగలేరు, నున్న, సూరంపల్లి, కొండపావులూరు, ఎదురుపావులూరు, ఉప్పులూరు, వణుకూరు లే అవుట్లలో మంజూరైన గహాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా లే అవుట్లో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అవసరమైన అంచనాలను మున్సిపల్ అధికారులు రూపొందించాలన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు లైన్లలో లబ్ధిదారులకు ఇబ్బందికలిగే పరిస్థితులు ఎదురైతే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు తక్షణమే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలన్నారు. ఈ నెల 13వ తేదీ గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ రాజ్ శాఖలకు చెందిన మండల, డివిజన్ స్థాయి అధికారులతో అంచనాలు రూపొందించడంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈటెలి కాన్ఫరెన్స్‌లో గహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రజిని కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ దేవినేని వెంకటరమణ, పంచాయితీ రాజ్ శాఖ ఎస్‌సి ఎ.వెంకటేశ్వర రావు, ఇఇ పిహెచ్.భూషణం, విద్యుత్ శాఖ ఎస్‌సి. కె.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పలుచోట్ల "జగనన్నే మా నమ్మకం'



ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 15 వ డివిజన్ రామలింగేశ్వర నగర్లో శుక్రవారం "జగనన్నే మా నమ్మకం' కార్యక్రమం నిర్వహించారు. వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ సూచనల మేరకు విజయవాడ డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గహసారథులు, వాలంటీర్లు కలిసి గడప గడపకూ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను వివరించారు.

22వ డివిజన్లో



22వ డివిజన్ 109 సచివాలయం పరిదిలోని కోతమిషన్ రోడ్డులో జరిగిన 'మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమంలో కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి పాల్గొన్నారు. కన్వీనర్లు, వాలంటీర్లు, గహసారధులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ

14 నుండి సిపిఎం, సిపిఐ ప్రచార భేరి

విజయవంతం చేయాలని నేతల పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : దేశాన్ని పాలిస్తున్న బిజెపి నిరంకుశ, వినాశకర, ప్రజా వ్యతిరేక పాలనా విధానాలను ఎండగట్టి, మన రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడుకునేందుకు ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన ప్రచార సమరభేరీని విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శులు డి.వి.కృష్ణ, సీహెచ్.కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆయా పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం, సిసిఐ నేతల ఈ సమరభేరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడంపై చర్చించారు. జిల్లావ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక ప్రచార దండోరా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఖచ్చితమైన వ్యూహాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీదేవి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుడ్డి రమేష్ పాల్గొన్నారు.



వచ్చే ఎన్నికల్లో అభివృద్ధికే పట్టంగట్టండి : వైసిపి

ప్రజాశక్తి-యంత్రాంగం

వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓట్లేసి తిరిగి అధికారంలోకి వచ్చేలా కృషిచేయాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారంనాడు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జరిగింది. గన్నవరం : వైసిపి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. దావాజిగూడెంలోని రాజీవ్ కాలనీలో ఈ కార్యక్రమాన్ని ఏఎంసీ ఛైర్పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ


అవనిగడ్డలో


గుడ్లవల్లేరులో


ఉయ్యూరులో

సభ్యురాలు ఏ.ఎలిజబెత్ రాణి, జెడ్పీకోఆప్షన్ సభ్యులు ఎండీ, గౌసాని, మండల పార్టీ అధ్యక్షులు పడమట సురేష్ లాంఛనంగా ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులతో కలిసి ఇంటింటికి వెళ్లి గత నలుగేళ్లుగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల నుండి సేకరించిన వివరాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. అనంతరం పామర్తినగర్‌లోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ అంజనీకుమారి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో పెద్ద ఎత్తున్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్. జగన్మోహన్రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య, ఉప సర్పంచి వేల్పుల బసవరావు, పార్టీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, మేచినేని బాబు, కైలే శివకుమార్, గిరిషాజు జలసూత్రం రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డికి మద్దతు పలకాలని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ముదునూరులో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రభుత్వంపై అభిప్రాయాలను సేకరించారు. వైసిపి ఉయ్యూరు మండల అధ్యక్షుడు దాసే రవి,


పమిడిముక్కలలో


గన్నవరంలో

సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, బోళ్ళపాడు సర్పంచ్ టి. సురేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గంగారత్నం, పల్లపోతు శ్రీనివాసరావు, మొవ్వ జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి 7వ వార్డులో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. **అవనిగడ్డ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం నుండి ప్రారంభమైన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మా భవిష్యత్తు అని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నూటికి 90 శాతం కుటుంబాలకు సీఎం జగనన్న కార్యక్రమాల వల్ల మేలు జరిగిందన్నారు. ఈనెల ఏడో తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని గ్రామ వాలంటీర్లు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. వైసిపి అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ మంచి జరిగితే ఆదరించమని ధైర్యంగా ప్రజలకు చెప్పే ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామానికి వెళ్లి ఇంటింటికి తిరిగి ప్రజల నుంచి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఇంటి తలుపులకు ఫోన్లలో అంటించారు. సచివాలయాల మండల కన్వీనర్ షేక్ నజీర్ భాష అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ, అవనిగడ్డ సర్పంచులు దాసరి విజయ్ కుమార్, గోరుముచ్చు ఉమా, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉప సర్పంచ్ మండల్ వెంకటేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్ తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** మండలంలోని డోకిపర్రు గ్రామంలో శుక్రవారం నమ్మకం నువ్వే జగన్ అన్న కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, కనుమూరి రామరెడ్డి , మెరుగు నాగేంద్రరావు,.బొడ్డు రమేష్, ముత్యాల రాజేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల సంక్షేమానికి నవరత్న పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తోందని మంటాడ సచివాలయ కన్వీనర్ గారపు రమాదేవిరెడ్డి అన్నారు. పమిడిముక్కల మండలంలోని మంటాడ సచివాలయం పరిధిలో 'మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమం శుక్రవారం జరిగింది. సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆశయాలకు అనుగుణంగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నిరంతరం అభివృద్దే ధ్యేయంగా కృషిచేస్తున్నారన్నారు. రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, వైసిపి నాయకులు యేనుగు మస్తానరావు, కోడిబోయిన కోటేశ్వరావు, మంటాడ ఎంపీటీసీ మేరుగ లక్ష్మి, వాలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్ కిషోర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయాలకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు బొంతుల బాపనమ్మకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. బాపనమ్మ చేతికి తీవ్ర గాయం కావడంతో సంఘటన విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ నాయుడు ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించి నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్రె బస్వారావు, సైకం శ్రీనివాసరావు, యర్రంశెట్టి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో సిలువ యాత్రలో పాల్గొన్న సింహాద్రి రమేష్‌బాబు


గుడివాడలో

క్రైస్తవ సోదరుల సిలువ యాత్రలు

ప్రజాశక్తి-యంత్రాంగం

గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని శుక్రవారంనాడు క్రైస్తవ సోదరులు సిలువ శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఉయ్యూరు : రెవరెండ్ ఫాదర్ మద్దాలి వరప్రసాద్ ఆధ్వర్యంలో సిలువ శాంతి ర్యాలీలో విచారణ సంఘస్తులు, సంఘ పెద్దలు, విచారణ గురువులు పాల్గొన్నారు. రెవరెండ్ ఫాదర్ జ్యోతి మనోహర్ బ్రదర్ ప్రతాప్, ఉయ్యూరు విచారణ ఉపదేశికులు మరియదల సభ్యులు, సంఘ పెద్దలు, ఉయ్యూరు విచారణ సంఘ పెద్దలు వేలాదిగా పాల్గొన్నారు. ఆర్‌సిఎం చర్చిలో దివ్య బలి పూజ కార్యక్రమం నిర్వహించారు. **కలెక్టరేట్ (కృష్ణా) :** తనవలే పొరుగు వారిని ప్రేమించు అన్న జీసెస్ బోధనలు ప్రతి ఒక్కరు ఆచరించాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఆర్ సి ఎం చర్చిలో క్రీస్తు సోదరులతో కలిసి రవీంద్ర ప్రార్థనలలో పాల్గొని మాట్లాడారు. ఐపిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరుణ్ కుమార్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, చిన్నం శేఖర్, లింగం విజయ్, కట్టా చరణ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక ఏలూరురోడ్‌లోని మౌంట్‌కార్మెల్ (ఆర్.సి.ఎం.) చర్చి ఫాదర్ గుజ్జుల మైఖేల్, రవికాంత్ కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన్నతేరేజమ్మ (ఆర్‌సిఎం-2) దేవాయలంలో ఫాదర్లు గుజ్జుల మైఖేల్, ఎం.లూయిస్‌లు సందేశం ఇచ్చారు. కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియం జోషి, ఇంటి స్వామిదాస్, కారే శ్రీనివాసరావు, వంగా ఆనంద్, రెబ్బా బాలరాజు, సెబాస్టియన్, క్రీస్తురాజు, భాస్కర్, స్వామిదాసు, విజయరాజు, యూత్ అధ్యక్షుడు ఎం.జోషి, సిస్టర్స్, మరియదళ సభ్యులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** స్థానిక ఆర్ సి ఎం చర్చి ఆధ్వర్యంలో బహిరంగ శిలువ మార్గాన్ని నిర్వహించారు. **గన్నవరం :** స్థానిక ఆర్‌సిఎం విచారణ గురువులు ఫాదర్ పసల తోమస్ ఆధ్వర్యంలో బాలయేసు దేవాలయం నుండి శిలువ యాత్ర పురవీధుల్లో జరిగింది. పారీస్ కౌన్సిల్ ఛైర్మన్ నీలం జాకబ్ , కౌన్సిల్ సభ్యులు,


పమిడిముక్కలలో

విన్సెంట్ డే పాల్ అసోసియేషన్స్, సిస్టర్స్, బ్రదర్స్ పాల్గొన్నారు. గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ జాయింట్ సెక్రెటరీ కే.ఎన్.బాబూరావు మాట్లాడారు. కే.ఎన్. బాబూరావు తో పాటు అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శి వీసం ప్రసాదరావు, కోశాధికారి గంప


పెదపారుపూడిలో

సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. **మొవ్వ :** మొవ్వ (కూచిపూడి) ఆర్ సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ పులపాక జాకబ్ ప్రసాద్ సారధ్యంలో క్రైస్తవ విశ్వాసులు శిలువను మోస్తూ కూచిపూడి, పెదపూడి ప్రధాన పురవీధులలో భారీ స్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. మొవ్వ, ఘంటసాల, పమిడిముక్కల, చల్లపల్లి, పామర్రు మండలాల విశ్వాసులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** మండలంలోని వెంట్రప్రగడ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ మరియ సాగర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెదపారుపూడి రక్షణ సైన్యం దేవాలయంలో వాసి బెనర్జీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కెనడా బాప్టిస్ట్ మిషన్ మిషన్ ఆధ్వర్యంలో పాస్టర్ తిరివీధి పీటర్ మహేశ్వరపురం దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీటర్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసి జయప్రద,వాసి నవ్య, మేడేపల్లి ప్రవీణ్, నత్తా భూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం (ఉంగుటూరు):** మండలంలోని తేలప్రోలు గ్రామంలో జోసఫ్ నగర్ విచారణ గురువులు పెయ్యాల ఆంథోని ఆధ్వర్యంలో సిలువ యాత్ర నిర్వహించారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ శివారు కోటగిరి లంక ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో ప్రధాన విచారణ గురువు సురేష్ మెర్లో ఆధ్వర్యంలో కోటగిరి లంక నుండి అవనిగడ్డ పురవీధులలో సిలువ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకు రాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి సిలువను మోశారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గోరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్, ఆర్ సి ఎం సంఘ నాయకులు కర్ర సుధాకర్, కంచర్ల ఆనంద్, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** మండలంలోని మేడూరు, లంకపల్లి, మంటాడ, వీరంకిలాకు, బొడ్డు వాని గూడెం ముదిరాజుపాలెం గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. మేడూరు సిబిసిఎంసి పాస్టర్ రెవరెండ్ రాజారత్నం, వీరంకిలాకు పెంతుకోస్తు చర్చిలో వినోదరావు, కృష్ణాపురం పాస్టర్ సామ్యూల్, మేడూరులో పాస్టర్ కృపానందం ప్రత్యేక ప్రార్థన చేశారు. కపిలేశ్వరపురం సిబిసి చర్చి, మేడూరు హోసన్నామందిరంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.




తిరువూరులో సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-తిరువూరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్ నుండి జై బావి, చీరాల సెంటర్లు, బాలికల ఉన్నత పాఠశాల మీదుగా కోకిలంపాడు రోడ్డులోని స్టేడియం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం ఈ నెల 5వ తేదీన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు రిక్రూట్మెంట్ అభ్యర్థుల ఈవెంట్స్ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంఓల తిరువూరు పట్టణ ప్రముఖులు గుళ్లపల్లి వెంకటర త్నం, గంపలగూడెం తహశీల్దారు బాలకృష్ణారెడ్డి, ప్రముఖ వైద్యులు తాళ్లూరి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

చినకంచి స్వామిని దర్శించుకున్న గురుమూర్తి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: పిఎం సలహాదారులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) బోర్డు సభ్యుడు, చార్టెడ్ అకౌంటెంట్ స్వామినాథన్ గురుమూర్తి నున్నలో చినకంచిగా పిలువబడే శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారి దేవస్థానాన్ని శుక్రవారం సందర్శించారు. చినకంచి ధర్మకర్త



మొక్కపాటి శర్మ ఆయనకు ఘన స్వాగతం పలికారు. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రెండు రోజుల పాటు చినకంచి పర్యటనకు రానున్న దృష్ట్యా ఏర్పాట్లపై ఆరా తీశారు. కంచి పీఠం ఆడిటర్ బాలకృష్ణ ఏర్పాట్ల వివరాలను వివరించారు. అనంతరం యాగశాల, గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వేద పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో చినకంచి ధర్మకర్త పసుమర్తి భాస్కరశర్మ, ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, కంచి పీఠం మేనేజర్ జానకిరామ్, యోగాచార్య పొలారెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా హెల్త్ క్లినిక్ భవనం పనులు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో



హెల్త్ కేర్ క్లినిక్ సెంటర్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులను ఆ గ్రామ సర్పంచ్ వంగల వైకుంఠం పర్యవేక్షిస్తున్నారు. మరో రెండు నెలల్లో కొత్తపల్లిలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

శ్రీనివాస్ గౌడ్‌కు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను మండల వైసిపి అధ్యక్షులుగా మండవ శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నియమితులైన మండవ శ్రీనివాస్ గౌడ్ ని జగ్గయ్యపేట మునిస్సుల్ చైర్మన్ రాఘవేంద్ర మరియు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కలిసి అభినందించారు. వైయస్సార్ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేయాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని కోరారు.

పన్నుల చెల్లింపుపై రాయితీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 30లోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని యజమానులు వినియోగించుకోవాలని కోరారు.

వాంబేకాలనీలో గడపగడపకూ సమస్యలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: 60వ డివిజన్ వాంబేకాలనీ ఎ.బ్లాక్ అపార్టుమెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం బృందం శుక్రవారం పర్యటించింది. స్థానికులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ గడపగడపకూ తిరుగుతున్న వైసిపి నేతలకు ప్రజా సమస్యలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయని, చెత్త పేరుకుపోయి నీరు పారుదల లేక దోమలు విజృంభిస్తున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల పేరిట పింఛన్లు తొలగించారన్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచడం వల్ల కార్మికులు మూడు పూటలా తినే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వాలు అబద్ధపు ప్రచారాలు మాని ప్రజా సమస్యల పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఎఇని ఫోన్ ద్వారా సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, కె.ఓంకార్, జె.కళ్యాణ్ కుమార్, ఎస్.అప్పన్న, కె.రంగస్వామి, పి.సాంబిరెడ్డి, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

వాంబే కాలనీ ఎ.బ్లాక్ అపార్ట్‌మెంట్లో నివసిస్తున్న ఉప్పుతల దుర్గాప్రసాద్ కొద్ది రోజుల క్రితం పాయకాపురం చెరువులో నిర్మిస్తున్న వైఎస్ఆర్ పార్కులో ఉన్న చెరువులో ఆడుకుంటానికి మరణించాడని, ఆ కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని బాబూరావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా


స్థానికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న సిపిఎం నాయకులు

బాబూరావు మట్లాడుతూ దుర్గాప్రసాద్ చనిపోయి పది రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. పనులు పూర్తికాకుండానే ఎటువంటి సెక్యూరిటీ లేకుండా పార్కులోకి అనుమతించడం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, దీనికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. దుర్గాప్రసాద్ తండ్రి శ్రీను మూగవాడని, రోజువారి బిల్డింగ్ కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడని కూతురు అంగవైకల్యంతో ఇబ్బందులు పడుతుందని, ఆ కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని కోరారు. గడపగడపకూ వైసిపి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించే పరిస్థితిల్లో లేదన్నారు. ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే ఏమి చెప్పాలో తెలియని పరిస్థితిలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో ప్రమాదాల జరగకుండా పార్కు చుట్టూ ఉన్న గోడ ఎత్తు పెంచాలని, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, చెరువును స్విమ్మింగ్ పూల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు.

దుర్గగుడి ఇఒ భ్రమరాంబకు సత్కారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి కార్యనిర్వాహణధికారిగా నేటితో రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసిన



సందర్భంగా శుక్రవారం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ కార్యనిర్వహణాదికారి దర్భముళ్ళ భ్రమరాంబని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ వీరి కాలంలో ఆలయంలో పరిపాలన అంతా సజావుగా సాగిందని, అత్యంత సీనియర్ ఆఫీసర్‌గా పరిపాలన గాడిలో పెట్టారని మునుముందు కూడా ఇదే రకమైన పాలన అందించే విధంగా శ్రీ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. రానున్న రోజుల్లో దేవాలయాన్ని మరింత అభివద్ధి పథంలో నడుపుతూ భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు కలిసి పనిచేసి సమిష్టిగా ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు పాల్గొన్నారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మను శుక్రవారం ఐఎఎస్ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు.



'చెత్త పన్ను కట్టొద్దు'

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్‌లో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని కళ్యాణ మండపం నుండి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, విద్యుత్, ఆస్తి పన్ను గతంలో పెరిగాయని అన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రజలపై వేసిన చెత్త పన్నును కట్టవద్దని అన్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు సరిగా అందడంలేదని తెలిపారు. దోమల సమస్య అధికంగా ఉండటం వలన విష జ్వరాలు వ్యాప్తిచెందినా పట్టించుకునే నాధుడు లేడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వింజమూరి సతీష-బాబు, పలగాని భాగ్యలక్ష్మి, పలగాని శివ, తేళ్ల భవాని, షేక్ బాబు, కంకణాల బాబు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-వన్‌టౌన్: తెలుగు బాప్టిస్ట్ చర్చ్ నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళాన్ని వెలంపల్లి ఫౌండేషన్ అందచేసింది. స్థానిక 49వ డివిజన్ ఫ్రైజర్ పేటలో గల తెలుగు బాప్టిస్ట్ చర్చ్ నూతన భవన నిర్మాణానికి మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు రూ. 10 లక్షలు విరాళం ఇస్తామని గతంలో హామీ ఇచ్చారు. కాగా ఈ మేరకు శుక్రవారం వెలంపల్లి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ సాయి అశ్విత చర్చ్ వద్దకు వెళ్ళి చర్చ్ పాస్టర్ , సంఘ పెద్దలకు రూ.10 లక్షల నగదు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవ నరసింహారావు, కొనకళ్ళ విద్యాధరరావు, స్థానిక నాయకులు బుదాల శ్రీను, తంగిరాల ప్రమీల, యర్రజొన్న విజయలక్ష్మి, గౌడుపెరు సుదీర్, జార్జ్ పాల్గొన్నారు.

9న ఎపి ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నిక చెల్లదు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఈ నెల 9వ తేదీన జరుగనున్న ఎపి ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికలు చెల్లవని, కొంత మంది పోటీ సంఘాన్ని ఏర్పాటుచేసి ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నారని అది చట్టబద్ధం కాదని ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ ఒలంపిక్ అసోసియేషణ్ కార్యదర్శి కె.పి.రావు అన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి ఒలంపిక్ అసోసియేషన్ 1961లో రిజిస్ట్రర్ కాబడి ఉందని, హైదరాబాద్‌లో ప్రదాన కార్యాలయం ఉందని, అసోసియేషన్‌కు 40 లక్షల నిధులు కూడా ఉన్నాయన్నారు. అయితే రాష్ట్ర విభజన తరువాత 2015లో కొంత మంది పోటీ సంఘం ఏర్పాటు చేసి ఒలంపిక్ అసోసియేషన్‌గా చెప్పుకుంటున్నారన్నారు. అయితే ఈనెల 9వ తేదీన ఎపి సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామని తమ వద్ద 23 క్రీడా సంఘాల మద్దతు ఉందని చెబుతున్నారన్నారు. వాటిలో 12 సంఘాలు తమ ఆధ్వర్యంలోని ఒలంపిక్ అసోసియేషణ్‌వే అన్నారు. అంతేకాకుండా కొన్ని క్రీడా సంఘాలు దొంగ సంఘాలుగా చూపి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తున్నారని ఇది సరైనది కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 9న జరిగే ఎన్నికలు చెల్లవని అన్నారు. ఈ కార్యక్రమంలో జుడో అసోసియేషన్ నుండి వెంకట్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని రామచంద్రాపురం జిల్లా ఆసుపత్రి పోస్టు పోర్టమ్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.ఎన్.కృష్ణ హరీష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎం.జి.రోడ్డులోని శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహనా సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వివిధ రకాలైన వైరస్‌ల కారణంగా ప్రజల్లో ఆరోగ్యం పట్ల ఆందోళన కలుగుతుందని అన్నారు. ప్రతిఒక్కరూ భయపడకుండనా ముందుగా వాటి గురించి తెలుసుకుని జాగ్రత్త పడాలన్నారు. విద్యార్థులు ఆహారం తినే ముందు పరిశుభ్రంగా చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఉతికిన దుస్తులను ధరించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు, ఇతర క్రిమి కీటకాలు



రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి డీన్ సిరిగుడి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఏటా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను తమ సంస్థ నిర్వహిస్తుందని, యుపిఎస్‌సిలో కూడా జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ శరత్‌చంద్ర తోట తదితరులు పాల్గొన్నారు.